# ఈనాడు నల్గొండ



## తీరొక్క పూలతో.. ఊరంతా పండగే



నల్గొండ: శ్రీనగర్ కాలనీ పార్కులో..

తెలంగాణ సంప్రదాయ పండగ ఎంగిలి పూల బతుకమ్మ ఉత్సవాలను బుధవారం నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాలు, వార్డుల్లోని కూడళ్లలో మహిళలు, యువతులు, చిన్నారులు ఒక చోట చేరి.. తీరొక్క రంగుల పూలతో తాము తయారు చేసిన బతుకమ్మలను అందంగా పేర్చి.. బతుకమ్మ పాటలకు నృత్యాలు చేశారు.

– న్యూస్‌టుడే, బృందం



నకిరేకల్: సాయి మందిరంలో బతుకమ్మ సంబురాలు



కేతేపల్లిలో..



మిర్యాలగూడ వాసవీ కాలనీలో..

## నేడు మంత్రి కోమటిరెడ్డి పర్యటన

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం నల్గొండలో పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి కోమటిరెడ్డి పర్యటన షెడ్యూల్ విడుదల చేశారు. రూ.75 లక్షలతో నిర్మించనున్న చంద్రగిరి విల్లాస్ రోడ్డు నిర్మాణాలు, 16వ వార్డులో రూ.20లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టి ఎంఎన్‌ఆర్‌గార్డెన్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం ప్రకాశంబజారులో నూతనంగా నిర్మించిన మటన్ మార్కెటు భవనాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం 11.30 గంటలకు ఏఆర్ నగర్‌లో రూ.35 లక్షల నిధులతో నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

## చెడును వదిలి మంచి మార్గంలో నడవాలి: జిల్లా న్యాయమూర్తి



గాంధీ విగ్రహానికి నివాళి అర్పించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవార్


నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: సమాజంలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు కలిగి ఉన్నప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు అన్నారు. గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం జిల్లా జైలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు చెడును వదిలి మంచి మార్గంలో పయనించాలని సూచించారు. చేసిన తప్పులు మళ్లీ చేయకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా సత్ప్రవర్తన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అలాంటి ఖైదీలకు జైలు నుంచి విడుదల, శిక్షను తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. జైలు జీవితం తరువాత సమాజానికి, కుటుంబానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఖైదీలు బయటకు రావాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. గాంధీ సిద్ధాంతాలు అందరూ అనుసరిస్తే ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి దీప్తి, 12వ పటాలం కమాండెంట్ సత్య శ్రీనివాస రావు, జైలు సూపరింటెండెంట్ ప్రమోద్, జైలర్ బాలకృష్ణ, ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టరేట్‌లో..** నల్గొండ సంక్షేమం: కలెక్టరేట్‌లో మహాత్మాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అదనపు కలెక్టర్లు టి.పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, తదితరులు పాల్గొన్నారు.

## గండంలో.. యువ మూత్రపిండం

కట్టంగూరు మండలానికి చెందిన మమత (21) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. తండ్రి అడ్డా కూలీ. తల్లి ఓ ప్రైవేటు వసతిగృహంలో పనిచేస్తుంది. ఏడాది క్రితం ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రికి వెళ్తే రెండు కిడ్నీలు చెడిపోయాయని వైద్యులు వెల్లడించారు. కొవిడ్‌లో రెండు సార్లు కరోనా సోకడంతో వైద్యులను సంప్రదించకుండానే విచ్చలవిడిగా మందులు వాడటంతోనే ఆమె రెండు కిడ్నీలు చెడిపోయాయని ప్రాథమికంగా నిర్ధారించారు. ఆమె ఏడాది నుంచి నల్గొండ కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటోంది.

కనగల్ మండలానికి చెందిన శిరీష (24)కు చిన్న వయసులోనే పెళ్లయింది. ఇద్దరు కూతుళ్లు. ప్రసవ సమయంలో ఎక్కువ డోస్ కలిగిన మందులు వాడటంతో ఆమె రెండు కిడ్నీలు చెడిపోయాయి. సరైన సమయంలో స్పందించి ఉంటే ఆమెకు ఈ పరిస్థితి వచ్చేది కాదని ఆమె కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదరికం అనుభవిస్తున్న ఆమె ఇద్దరు కూతుళ్లు అమ్మ ఆస్పత్రి కోసం ఎదురుచూస్తున్నారు. వీరితో పాటు నల్గొండకు చెందిన 24 ఏళ్ల ఉమర్ ఫరూఖ్, 18 ఏళ్ల మరో యువకుడికీ ఇదే పరిస్థితి.



ఈనాడు, నల్గొండ: ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా కొవిడ్ అనంతరం కిడ్నీ బాధితుల్లో ఎక్కువగా 18 ఏళ్ల నుంచి 25 ఏళ్ల వారు ఉండటం ఆందోళన కలిగించే పరిణామమే. నల్గొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో గత కొంత కాలం నుంచి డయాలసిస్ కేంద్రానికి యువత ఎక్కువగా వస్తుండటం గమనార్హం. గత రెండేళ్లలో సుమారు 35 మంది ఒక్క నల్గొండ జీజీహెచ్‌లో చికిత్స తీసుకుంటుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. సూర్యాపేటలోనూ క్రమంగా చిన్న వయసువారికి డయాలసిస్ చికిత్సలు పెరిగాయని సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 20 ఏళ్లలోపు వారు పది మందికి పైగా చికిత్సకు వస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ డయాలసిస్ కేంద్రాల్లో చికిత్స తీసుకుంటున్న వారిని కలుపుకొంటే ఈ సంఖ్య మరింతగా ఉంది. విచ్చలవిడిగా డ్రగ్స్ వాడకంతో పాటు కిడ్నీ సమస్యలను సరైన సమయంలో గుర్తించక పోవడంతోనే ఈ పరిణామాలు సంభవిస్తున్నట్లు వైద్యులు అభిప్రాయపడుతున్నారు. విచ్చలవిడిగా మందులు (యాంటీ బయాటిక్స్)తోనే ఎక్కువగా కిడ్నీ రోగాలు వస్తున్నాయని చెబుతున్నారు.. అవగాహన లోపంతోనూ చిన్న వయసువారిలో కిడ్నీలు ఫెయిల్ అవుతున్నాయని నల్గొండ ఏరియా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ మాతృనాయక్ 'ఈనాడు'కు వెల్లడించారు.

### ఒక్క వైద్యుడుంటే ఒట్టు..!

ఉమ్మడి జిల్లాలో నల్గొండతో పాటు మిర్యాలగూడ, సూర్యాపేట, భువనగిరి, హుజూర్‌నగర్, కోదాడ, చౌటుప్పల్, దేవరకొండ, నాగార్జునసాగర్, ఆలేరుల్లో 55 పడకల డయాలసిస్ కేంద్రాలున్నాయి. నిత్యం 472 మందికి రక్తశుద్ధి నిర్వహిస్తున్నారు. ఏ కేంద్రంలోనూ మూత్రపిండాల వైద్యులు (నెఫ్రాలజీ) లేరు. దీంతో టెక్నీషియన్స్‌తోనే ఈ కేంద్రాలను నడిపిస్తున్నారు. మరోవైపు అన్ని డయాలసిస్ కేంద్రాలకు బాధితులు ఏటేటా పెరుగుతున్నారు. అందుకు తగ్గ సౌకర్యాలు ఈ కేంద్రాల్లో లేకపోవడంతో హైదరాబాద్‌లోని పలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

❒ గతేడాది 5,855 మంది ఆరోగ్యశ్రీ కింద డయాలసిస్ చికిత్స తీసుకుంటే, ఈ ఏడాది తొలి 7 నెలల్లోనే 3,890 మంది చికిత్స పొందడం గమనార్హం. ఈ సంఖ్య ఏడాది ఆఖరుకు 6 వేలకు చేరుతుందని వైద్యులు వెల్లడిస్తున్నారు.



నల్గొండ డయాలసిస్ కేంద్రంలో చికిత్స తీసుకుంటున్న బాధితులు

## ధాన్యం కొనుగోళ్లపై తేలని స్పష్టత



నల్గొండ మార్కెట్ యార్డులో పంపిణీకి సిద్ధంగా స్టాంపింగ్ వేయని తూకం యంత్రాలు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. నల్గొండ సమీపంలోని ఆర్జాలబాయి పీఏసీఎస్‌తో పాటు పలు కేంద్రాల్లో రైతులు ధాన్యం తీసుకొచ్చి కుప్పలు పోశారు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు ఒకటిన కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని ఇటీవల ప్రకటించింది. కానీ.. జిల్లాలో కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని చోట్ల వర్షాలు పడే సూచనలు కనిపిస్తుండటంతో అన్నదాతల్లో కంటిమీద కునుకులేకుండా పోయింది.

❒ ఇప్పటికే మార్కెటింగ్ శాఖ అధికారులు తూకం, తేమ యంత్రాలు సిద్ధం చేశారు. ధాన్యం తూర్పాల పట్టే యంత్రాలు అందుబాటులో ఉంచామని.. కేంద్రాలు ఏర్పాటుకు తేదీలు ప్రకటిస్తే పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు. తూనికల కొలతల శాఖ అధికారులు మాత్రం ఇంతవరకు తూకం యంత్రాలను పరిశీలించలేదు. నల్గొండ మార్కెట్ కమిటీ పరిధిలోని యంత్రాలను సైతం ఆ శాఖ అధికారులు తనిఖీ చేయలేదు. గత సీజన్‌లో తూకం యంత్రాలను అధికారులు పరిశీలించకుండానే కేంద్రాలకు పంపారనే విమర్శలున్నాయి. కనగల్ మండలంలో రైతులు గతంలో ఫిర్యాదు చేయడంతో తూనికల కొలతల శాఖ అధికారులు పరిశీలించి ఎక్కువ తూకం వేస్తున్నారని కేసు నమోదు చేశారు. వేములపల్లి, చండూరు మండలాల్లో తూకం యంత్రాలు సరిగా లేవని ఎక్కువ తూకం వస్తున్నాయని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ శాఖ అధికారులు స్పందించి తూకం యంత్రాలను పరిశీలించి స్టాంపింగ్ వేయాలని రైతులు కోరుతున్నారు.

### కేంద్రాలు ప్రారంభిస్తాం..

హరీశ్, డీఎం, పౌర సరఫరాల సంస్థ

ధాన్యం కొనుగోలు కేంద్రాల విషయమై కలెక్టర్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం ఉంది. ఆ సమావేశంలో నిర్ణయం తీసుకుంటారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడొద్దు. కేంద్రాలు ప్రారంభిస్తాం. ధాన్యం ఆరబెట్టి తీసుకురావాలి.

## డీఎస్సీ ధ్రువ పత్రాల పరిశీలన

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 పరీక్షలో 1:3 కింద ఎంపిక చేసిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభమైంది. బుధవారం తెల్లవారు జామున విద్యాశాఖాధికారులు 1:3 నిష్పత్తి జాబితా రావడంతో ఉదయం నుంచి ఎస్జీటీ అభ్యర్థుల పత్రాల పరిశీలన మొదలైంది. ఎస్జీటీలో మొత్తం 1041 మంది అభ్యర్థుల జాబితా పంపారు. పరిశీలనకు డైట్ కళాశాలలో 9కౌంటర్లు ఏర్పాటు చేశారు. మొదటి రోజు 212 మంది అభ్యర్థులు హాజరు కాగా.. వారిలో 207 మంది తెలుగు, అయిదుగురు ఉర్దూ మీడియం వాళ్లున్నారు. ఈ నెల 5వ తేదీ వరకు ఈ పరిశీలన కొనసాగనుంది. గురువారం నుంచి స్కూల్ అసిస్టెంట్‌ల సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టనున్నారు. డీఈవో బి.భిక్షపతి పర్యవేక్షిస్తున్నారు.



నల్గొండలోని డైట్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన ఎస్జీటీ అభ్యర్థులు

## చెర్వుగట్టులో లక్ష పుష్పార్చన



నార్కట్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే: చెర్వుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి గుహాలయం అమావాస్యకు తోడు సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది. ప్రధాన అర్చకుడు రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్వామివారికి లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. అలానే ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా శివసత్తులు అధిక సంఖ్యలో విచ్చేసి గుట్టపైన బతుకమ్మ ఆడారు. ఈవో నవీన్, గ్రామస్థులు పాల్గొన్నారు.



గట్టుపైన బతుకమ్మలతో శివసత్తులు

## నేడే నకిరేకల్ పుర ఛైర్మన్ ఎన్నిక

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్ పురపాలిక ఛైర్మన్ ఎన్నికను గురువారం నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పుర ఛైర్మన్‌గా ఉన్న రాచకొండ శ్రీనివాస్ (భారాస)పై ఆగస్టు 12న కాంగ్రెస్ ఆధ్వర్యంలో 16 మంది కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఛైర్మన్ పదవి ఖాళీ అయింది. వైస్ ఛైర్‌పర్సన్‌గా ఉన్న మురారిశెట్టి ఉమారాణికి ఛైర్మన్ విధులను తాత్కాలికంగా కలెక్టర్ అప్పగించారు. ఖాళీ అయిన ఛైర్మన్ స్థానానికి ఈనెల 3న ఎన్నిక నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం గత నెల 21న ఆదేశాలు జారీచేయడంతో ప్రత్యేక సమావేశం నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పుర పరిధిలోని 20 మంది కౌన్సిలర్లను సమావేశానికి ఆహ్వానిస్తూ ఈ పాటికే నోటీసులు అందజేశారు. గురువారం ఉదయం 11 గంటలకు నల్గొండ ఇన్‌ఛార్జి ఆర్డీవో శ్రీదేవి ప్రత్యేక అధికారిగా పుర ఛైర్మన్ ఎన్నికను నిర్వహించనున్నారని, ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పుర కమిషనర్ డి.బాలయ్య తెలిపారు.



నకిరేకల్: పుర కార్యాలయంలో ప్రత్యేక సమావేశంలో పార్టీల వారీగా కౌన్సిలర్లు కూర్చునేందుకు ఏర్పాట్లు

### లండన్ వెళ్లే ముందుగానే..

తన అనుచరుడు చౌగోని శ్రీనివాస్ సతీమణి రజితను ఛైర్‌పర్సన్‌గా ఎంపిక చేయాలని ఇటీవల లండన్ పర్యటనకు వెళ్లే ముందుగానే ఎమ్మెల్యే వీరేశం పార్టీ నాయకులు, కౌన్సిలర్లతో సమావేశమై నిర్ణయించినట్లు తెలిసింది. ఛైర్మన్ ఎన్నిక కోసం 11 మంది సభ్యుల మద్దతు అవసరంగా కాగా.. 16 మంది సభ్యుల బలం కాంగ్రెస్‌కు ఉండటంతో ఎన్నిక లాంఛనమేనన్న ధీమాతో ఉన్నారు. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన అవసరం రాదనే యోచనతో వీరేశం లండన్‌కు వెళ్లారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

❒ అవిశ్వాసంతో తొలగించిన భారాస ఛైర్మన్ గౌడ సామాజిక వర్గానికి చెందిన వారు. కాంగ్రెస్ నుంచి కూడా అదే సామాజికవర్గానికి చెందిన రజితను ఛైర్‌పర్సన్‌ను చేయడం ద్వారా ఆ వర్గం నుంచి సానుకూలత రావడంతో పాటు బీసీ జనరల్‌కు రిజర్వుచేసిన పుర ఛైర్మన్ స్థానంలో మహిళకు అవకాశం కల్పించినట్లు అవుతుందన్న యోచనతోనే ఎమ్మెల్యే ఈ నిర్ణయం తీసుకున్నారని ఆ పార్టీ నాయకులు వివరించారు. ఎన్నిక ప్రక్రియను పార్టీ నుంచి పర్యవేక్షించే బాధ్యతలను కాంగ్రెస్ మ్యానిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మాద యాదగిరి, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, గాదగోని కొండయ్య, నకిరేకంటి నరేందర్‌లకు ఎమ్మెల్యే అప్పగించారని సమాచారం.

## కుటుంబ డిజిటల్ కార్డుపై నేటి నుంచి సర్వే: కలెక్టర్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: కుటుంబ డిజిటల్ కార్డు ఇచ్చేందుకు పైలెట్ ప్రాజెక్టు కింద గురువారం నుంచి ప్రతి నియోజకవర్గంలో ఒక పుర వార్డు, ఒక గ్రామంలోని వార్డులో సర్వే ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కుటుంబ డిజిటల్ కార్డు సర్వే బృందాల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

❒ ఆధార్ కార్డు మాదిరిగా కుటుంబానికి కూడా ఒక కార్డు ఉండాలన్న ఉద్దేశ్యంతో కుటుంబ డిజిటల్ కార్డు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, సర్వే బృందాలు శ్రద్ధతో చేయాలని సూచించారు. 3వ తేదీ నుంచి ఐదు రోజుల్లో సర్వే పూర్తిచేసి వివరాలు సమర్పించాలన్నారు. 150 గృహాలకు ఒక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు.

❒ తహసీల్దార్, ఎంపీడీవో, పట్టణ ప్రాంతంలో పుర కమిషనర్, మండల స్థాయిలో మండల అధికారులు, ఒక ఫొటో గ్రాఫర్ చొప్పున ఉంటారని, సర్వే గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఒక్కరే రెండు కుటుంబాల్లో సభ్యులుగా ఉండకూడదని స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులందరిని కలిపి ఫొటో తీయాలని.. ఒక వేళ వారు అందుబాటులో లేకుంటే ఏదో ఒక రోజు వెళ్లాలన్నారు.

❒ అదనపు కలెక్టర్లు పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్, జెడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, నల్గొండ, దేవరకొండ, చండూరు ఆర్డీవోలు శ్రీదేవి, శ్రీరాములు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

### సర్వే చేసే ప్రాంతాలు ఇవే..

నల్గొండ పురపాలికలో 4వ వార్డు కేశరాజుపల్లిలో, తిప్పర్తి మండల గంగన్నపాలెంలో, నకిరేకల్ 9వ వార్డు, రామచంద్రాపురం (కట్టంగూరు), జమస్థాన్‌పల్లి (మునుగోడు), చండూరు పుర పరిధిలో 3వ వార్డు, దేవరకొండలో 20వ వార్డు, అచ్చంపేటపట్టి (చందంపేట), నందికొండ పుర పరిధిలోని 11వ వార్డు, కొణతాలపల్లి (త్రిపురారం), మిర్యాలగూడలో 2వ వార్డు, మిర్యాలగూడ మండలం రుద్రారం గ్రామంలో సర్వే చేపట్టనున్నారు.

## దేవీ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

నీలగిరి, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి భక్తులు, భవాని స్వాములు, ఆలయాల నిర్వాహకులు అన్ని ఏర్పట్లు చేస్తున్నారు. అమ్మవారిని తొమ్మిది రోజులు తొమ్మిది రూపాల్లో పూజించడానికి ప్రత్యేకంగా అలంకరించిన మండపాలను ఏర్పాటు చేశారు. గురువారం నుంచి ఈనెల 12 వరకు అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తారు. తొమ్మిది రోజులు నిర్వహించే పూజల సందర్భంగా అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలను భక్తులు సమర్పిస్తారు. అమ్మవారి మండపాల వద్ద ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.



నల్గొండలో ఏర్పాటు చేసిన మండపం

## నీరు ముంచె.. పనులు నిలిచె

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ జలాశయం నుంచి నెల్లికల్లు లిఫ్టు కోసం నిర్మిస్తున్న పంప్‌హౌజ్ సాగర్ నీటితో మునిగిపోయింది. కృష్ణపట్టె ప్రాంతంలోని భూములకు సాగునీటిని అందజేయాలన్న లక్ష్యంతో సుమారు రూ.664 కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయాలని 2021 ఫిబ్రవరి 10న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా నీటిని పంపింగ్ చేయడానికి సాగర్ జలాశయంలో సుమారు 32 మీటర్ల లోతు, 25 మీటర్ల వెడల్పుతో జలాశయం నీటిమట్టం 574 అడుగుల స్థాయి వరకు పంప్‌హౌజ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎత్తిపోతల పథకం పనులన్నీ 18 నెలల్లో పూర్తి చేయాలన్న నిబంధనలతో ఓ ఇంజినీరింగ్ కంపెనీకి బాధ్యతలను అప్పగించారు. ఈ మధ్యలోనే రాష్ట్ర శాసనసభ ఎన్నికలు రావడంతో ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పనులు నిలిచిపోయాయి. సాగర్ జలాశయంలోని నీరు పంప్‌హౌజ్‌లోకి రాకుండా గరిష్ఠ స్థాయి నీటిమట్టం 590.00 వరకు రింగ్‌బండ్‌ను ఏర్పాటు చేశారు. కానీ ఈ ఏడాది సాగర్‌కు ఒక్కసారిగా నీరు రావడంతో నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరడంతో మట్టికట్ట నుంచి జాలునీరు వచ్చి చేరడంతో పంప్‌హౌస్ మొత్తం నీటితో నిండిపోగా.. నిర్మాణపనులు నిలిచిపోయాయి.



పంప్‌హౌస్‌లోకి వచ్చిన నీరు

### నీరు తగ్గిన వెంటనే పునఃప్రారంభిస్తాం:

శ్రీధర్‌రావు, ఎస్ఈ, ఎన్నెస్పీ

నెల్లికల్లు ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పంప్‌హౌజ్‌లోకి చేరిన నీరు తగ్గిన వెంటనే నిర్మాణ పనులను ప్రారంభించి త్వరగా పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకుంటాం.

## సహాయం అందిస్తేనే.. సర్వే ముందుకు



డిజిటల్ పంట సర్వే చేయలేమంటూ ఇటీవల నల్గొండ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఏఈవోలు

నాంపల్లి, న్యూస్‌టుడే:

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న డిజిటల్ పంట సర్వేకు ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సర్వే బాధ్యతలను వ్యవసాయ విస్తరణాధికారులకు (ఏఈవో) ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు శిక్షణ ఇచ్చి యాప్‌లను ఏఈవోలకు అందించింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మంగళవారం సర్వే ప్రారంభించాల్సి ఉండగా.. పని ఒత్తిడి, సిబ్బంది కొరత వంటి కారణాలతో సర్వే చేయలేమంటూ ఏఈవోలు చేతులెత్తేస్తున్నారు. వ్యవసాయ శాఖలోని 49 రకాల పనులు చేస్తూనే.. డిజిటల్ సర్వే నిర్వహించటం అసాధ్యం అంటున్నారు. పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి తమకు సహాయక సిబ్బందిని నియమిస్తే సర్వే చేస్తామని చెబుతున్నారు.

### ఎందుకీ పంట సర్వే..?

భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఆహార భద్రత, పంటల బీమాతో పాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్టాన్ని అంచనా వేయడం, ఆహార ధాన్యాల ఎగుమతి, పంటల కొనుగోలు, సాగు ప్రణాళిక, మార్కెటింగ్ తదితరాలకు డిజిటల్ పంట సర్వే ముఖ్య భూమిక పోషించనుంది. ఇందులో భాగంగా వ్యవసాయరంగంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(డీపీఐ)ని రూపొందించే లక్ష్యంతో 'డిజిటల్ అగ్రి మిషన్' పథకాన్ని కేంద్రం తీసుకొచ్చింది. దీని అమలుకు రూ.2,817 కోట్లు వెచ్చిస్తోంది. రైతులకు ప్రయోజనం చేకూర్చడానికి, వ్యవసాయ సామర్థ్యాన్ని పెంచడానికి ఆధునిక సాంకేతికతను వినియోగించనుంది. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించేందుకు సంకల్పించింది.

### ఇతర రాష్ట్రాల్లో ఇదీ పరిస్థితి..

ఆంధ్రప్రదేశ్‌లో 1,000-1,500 ఎకరాల వరకు ఒక గ్రామ వ్యవసాయ సహాయకుడిని అక్కడి ప్రభుత్వం నియమించింది. గ్రామ స్థాయిలో వివిధ వ్యవసాయ సర్వేలు, ప్రభుత్వ పథకాల అమలులో లబ్ధిదారులైన రైతులను గుర్తించటం, ధ్రువపత్రాల సేకరణ, రైతు సమావేశాల వంటి విధులు నిర్వర్తించడంతో ఏఈవోల సేవలు అన్నదాతలకు మరింత చేరువయ్యాయి.

❒ మహారాష్ట్ర, ఒడిశాలలో టెండరు ప్రక్రియ ద్వారా ప్రైవేటు కంపెనీలకు డిజిటల్ పంట సర్వే బాధ్యతలు అప్పగించారు. కర్ణాటకలో ఒప్పంద ప్రాతిపదికన సిబ్బందిని నియమించి సర్వే చేయిస్తున్నారు. తమిళనాడులో వ్యవసాయ విద్యనభ్యసించిన వారిని రోజువారీ వేతనంతో పని చేయించుకుంటున్నారు.

❒ కేంద్ర ప్రభుత్వ సూచనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ వ్యవసాయ సహాయకులను నియమిస్తే సర్వే చేయడానికి సిద్ధమని ఏఈవోల సంఘం రాష్ట్ర, జిల్లాల నాయకులు చెబుతున్నారు.

### ఉమ్మడి జిల్లాలో సాగు భూమి, ఏఈవోల వివరాలు

| సాగు భూమి (ఎకరాలు లక్షల్లో) | జిల్లా | ఏఈవోలు |
|---|---|---|
| 12 | నల్గొండ | 140 |
| 6.90 | సూర్యాపేట | 92 |
| 4.70 | యాదాద్రి | 82 |

### సిబ్బంది కొరతే ప్రధాన సమస్య..

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో 314 మంది ఏఈవోలు పనిచేస్తున్నారు. వీరి పరిధిలో సుమారు 23.6 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ప్రతి 5 వేల ఎకరాలకు ఒకరు చొప్పున 472 మంది ఏఈవోలు అవసరం. ఉమ్మడి జిల్లాలోని 60 శాతం క్లస్టర్లలో సాగు భూమి 5 వేల ఎకరాలకు మించి ఉంది. నాంపల్లి మండలంలోని నాలుగు క్లస్టర్ల పరిధిలోని ఒక్కో ఏఈవో పరిధిలో 9 వేల ఎకరాలకు మించి సాగు భూమి ఉండటం గమనార్హం. డిజిటల్ సర్వేలో భాగంగా సదరు ఏఈవోలు తమ పరిధిలోని అన్ని పంటపొలాల్లోని సర్వే నంబర్లలోకి వెళ్లి వివరాలను ఆన్‌లైన్లో పొందుపరచాల్సి ఉంటుంది.


యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో బతుకమ్మ వేడుక


సూర్యాపేట సద్దుల చెరువు వద్ద..


భూదాన్‌పోచంపల్లిలో..


చౌటుప్పల్‌లో.. పురపాలిక ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, సంధ్య దంపతులు, మహిళలు

# ఊరూవాడా.. ఉయ్యాలపాట..!


నల్గొండ: ఆర్టీసీ కాలనీలో..


నూతనకల్‌లో...


ఆత్మకూరు(ఎం)లో వీర్ల చెరువు వద్ద ..

## పతకాల పట్టు..!

చిలుకూరు, న్యూస్‌టుడే: వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి వెయిట్‌లిఫ్టింగ్‌లో జాతీయస్థాయిలో రాణిస్తున్నాడు. క్రీడలపై ఆసక్తితో ఎన్నో పతకాలు సాధిస్తున్నాడు మండల కేంద్రానికి చెందిన యశ్వంత్. కుమారుడి ఆసక్తిని గమనించిన తండ్రి ప్రోత్సహించాడు. 2013లో సికింద్రాబాద్‌లోని హకీంపేట క్రీడా పాఠశాలలో ప్రవేశం వచ్చింది. దాంతో చదువుతో పాటు వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకొన్నాడు.


జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో యశ్వంత్‌గౌడ్


★ హైదరాబాద్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2015లో నిర్వహించిన పోటీల్లో 50 కిలోల విభాగంలో 3వ స్థానంలో నిలిచి మొదటిసారి పతకం సాధించాడు. తర్వాత స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బంగారు పతకాన్ని సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. 2018లో ఖేల్ ఇండియా ఇంటర్నేషనల్ గేమ్స్‌కు ఎంపికయ్యాడు. 2021లో నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో మూడు బంగారు పతకాలు సాధించాడు. గత నెల యాదాద్రి జిల్లాలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర పదో వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో 96 కిలోల విభాగంలో మొదటి స్థానంలో నిలిచాడు. అక్టోబరులో హిమాచల్ ప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు తెలంగాణ నుంచి అర్హత సాధించాడు.

★ ప్రభుత్వం ప్రోత్సహిస్తే జాతీయస్థాయిలో మరిన్ని పతకాలు సాధిస్తానని యశ్వంత్‌గౌడ్ తెలిపాడు.

## రాగిజావ.. చిన్నారికి చేవ

◆ అంగన్‌వాడీల్లో పంపిణీకి ఏర్పాట్లు

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీల్లో రాగిజావ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. త్వరలో అన్నపూర్ణ ట్రస్ట్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఇటీవల వెల్లడించారు. కేంద్రాల్లో పోషకాహారం అందిస్తున్నా. దానికి తోడుగా రాగిజావ ఇవ్వడం ద్వారా పిల్లల్లో ఎదుగుదల పెరుగుతుందని భావిస్తున్నారు. నల్గొండ జిల్లాలోని తొమ్మిది ప్రాజెక్టుల పరిధిలో 2,096 కేంద్రాలు ఉన్నాయి. మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 85,788 మంది, గర్భిణులు 10,245 మంది, బాలింతలు 7,009 మంది నమోదై ఉన్నారు.



పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు కావాల్సిన పోషకాలు ఇందులో ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు.

**ఒక పూట సంపూర్ణ భోజనంలో పిల్లలకు ఉండాల్సిన పదార్థాలు**

| | |
|---|---|
| బియ్యం | 75 గ్రాములు |
| కందిపప్పు | 15 గ్రాములు |
| నూనె | 5 మి.లీ. |
| గుడ్డు | 1 |

### పోషకాలిలా..

★ 100 గ్రాముల రాగుల్లో 328 క్యాలరీల శక్తి ఉంటుంది. ఐరన్ 3.9 మిల్లీగ్రాములు, సోడియం 11 మి.గ్రా, కాల్షియం 344 మి.గ్రా, పొటాషియం 408 మి.గ్రా ఉంటాయి.

★ పిల్లల ఎముకలు దృఢంగా మారడానికి కావాల్సిన కాల్షియం అందుతుంది.

★ కాల్షియం, ప్రొటీన్, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇనుము మోతాదు అధికంగా ఉండడంతో రక్తహీనత తగ్గుతుంది.

★ 'సీ' విటమిన్‌తో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

★ కండరాల ఆరోగ్యంతో పాటు రక్తం తయారు కావడానికి దోహదపడుతుంది.

**పిల్లల ఎదుగుదలకు దోహదం..**

– డాక్టర్ అజహర్ అహ్మద్, ఎంవో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అడవిదేవులపల్లి

రాగి జావ ఎదిగే పిల్లలకు చాలా అవసరం. దీంట్లో ఉండే పోషకాలు వారిని బలంగా మారుస్తాయి. దీనిలో ఉండే అయోడిన్ కారణంగా ఇన్‌ఫెక్షన్లు దరి చేరవు.

## శ్రమించి.. ఖాకీ కొలువు సాధించి!



మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ప్రస్తుత రోజుల్లో ప్రభుత్వ కొలువు సాధించడం అనేక మంది కల. ఉన్న కొద్దిపాటి ఉద్యోగాలకు ఎంతో మంది పోటీ పడుతున్నప్పటికి తాము కలలు కన్న ఉద్యోగం కోసం ఎన్ని కష్టాలు ఎదురైనా తట్టుకుని నిలబడి.. చివరికి ప్రభుత్వ కొలువు సాధించి అనేక మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు పలువురు యువత. యూనిఫాం ఉద్యోగంపై మక్కువతో ఇటీవలే ఎస్సై ఉద్యోగాలు సాధించిన ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు యువతను 'న్యూస్‌టుడే' పలుకరించింది.

### ఐదు ఉద్యోగాలు సాధించాను

– మల్లు సంజీవరెడ్డి, దిర్శించర్ల, నేరేడుచర్ల మండలం, సూర్యాపేట



మాది వ్యవసాయ కుటుంబం. అమ్మ, నాన్న ధనమ్మ, వెంకట్‌రెడ్డి వ్యవసాయం చేస్తూ నన్ను, అన్నయ్య నర్సిరెడ్డిని చదివించారు. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేది నాతో పాటు కుటుంబ సభ్యుల కల. డిగ్రీ హైదరాబాద్ నిజాం కళాశాలలో, ఎంసీఏ, ఎంబీఏ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుతూ, ట్యూషన్లు చెబుతూ ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యాను.

◆ 2018లో ప్రభుత్వ ఉద్యోగానికి ప్రయత్నించి విఫలమయ్యాను. దీంతో నిరాశ చెందకుండా మరింత కష్టపడి 2022-23 కాలంలో సీఆర్పీఎఫ్ ఎస్సైతో పాటు రైల్వేలో ట్రైన్ మేనేజర్, గ్రూప్-డీ ఉద్యోగాలు సాధించాను. ఈ లోగా పోలీస్ శాఖలో నోటిఫికేషన్ రావడంతో కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు దరఖాస్తు చేసి రెండు ఉద్యోగాలు సాధించాను. ఎస్సైగా యాదాద్రి జోన్ టాపర్‌గా సైతం నిలిచాను. ఇలా 5 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి.. ఇటీవలే ఎస్సై ఉద్యోగంలో చేరి.. మిర్యాలగూడ గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో శిక్షణ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నాను.

### అమ్మ కల నెరవేర్చాను

– మారెళ్ల మౌనిక, తొగర్రాయి, కోదాడ మండలం, సూర్యాపేట జిల్లా



నేను డిగ్రీ, బీఈడీ పూర్తి చేశాను. నాన్న మాల్యాద్రి తాపీ మేస్త్రీ, అమ్మ వెంకటనర్సమ్మ గృహిణి. చదువు పూర్తయిన వెంటనే హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగంలో చేరాను. నాకు ప్రభుత్వ ఉద్యోగం సాధించడం, అమ్మకు నేను యూనిఫాం ఉద్యోగం చేయడం కల.


◆ మా ఇద్దరి కలలు నెరవేరాలనే లక్ష్యంతో ఓ వైపు ఉద్యోగం చేసుకుంటూనే ఎస్సై పరీక్షలకు సన్నద్ధమయ్యాను. రోజుకు 10 గంటల పాటు చదువుతూ.. స్వతహాగా శిక్షణ పొందాను. దీంతో రైల్వేలో గ్రూప్-4 ఉద్యోగం వచ్చింది. అమ్మ కలను నెరవేర్చాలనే ధ్యేయంతో మరోసారి ప్రయత్నించి ఎస్సై ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం మిర్యాలగూడ రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శిక్షణ ఎస్సైగా పని చేస్తున్నాను.

### ఎస్సై కావడమే ధ్యేయంగా

– వర్కాల సురేష్‌రెడ్డి, బోయగూడెం, తిరుమలగిరి సాగర్ మండలం, నల్గొండ జిల్లా



మాది మధ్యతరగతి వ్యవసాయ కుటుంబం. అమ్మానాన్న రేవతి, వెంకట్‌రెడ్డి వ్యవసాయం చేస్తూ నన్ను చదివించారు. చలకుర్తి నవోదయ పాఠశాలలో పదో తరగతి చదివి 10 జీపీఏ సాధించాను. దీంతో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. ఇంటర్, ఇంజినీరింగ్ అదే కళాశాలలో 80 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాను. పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఇంజినీరింగ్ చదివే సమయంలో 2020లోనే కానిస్టేబుల్ అర్హత పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించాను కానీ.. కాలికి గాయంతో ఈవెంట్స్ సాధించలేకపోయాను. దీంతో నిరుత్సాహానికి గురి కాకుండా ఎస్సై ఉద్యోగానికి సన్నద్ధమై.. ఎట్టకేలకు నా జీవిత లక్ష్యమైన ఖాకీ కొలువు సాధించాను. ప్రస్తుతం శిక్షణ ఎస్సైగా సూర్యాపేట జిల్లా చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్నాను.



యువ టూరిజమ్ క్లబ్ లోగో

## పాఠశాలల్లో పర్యాటక క్లబ్‌లు

ఆలేరు, న్యూస్‌టుడే: పాఠశాలల్లో విద్యార్థులకు చదువుతో పాటు చారిత్రక, వారసత్వ అంశాలపై ఆసక్తి, పట్టు పెంచేందుకు రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక దృష్టిని సారించింది. ఇందులో భాగంగా యువ టూరిజం పేరిట ప్రభుత్వ పాఠశాలల్లో పర్యాటక క్లబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుడుతోంది. ఇందుకు సంబంధించి విద్యాశాఖ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో వీటిని ఏర్పాటు చేసి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### ఏర్పాటు ఇలా..

ఏడు నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులు ఉన్నచోట వీరిని క్లబ్‌లలో సభ్యులుగా చేర్చుతారు. ఒక్కో క్లబ్‌కు ఒక విద్యార్థి బాధ్యత వహిస్తారు. ఒక ఉపాధ్యాయుడు సమన్వయకర్తగా నాయకత్వం వహిస్తాడు. ప్రధానోపాధ్యాయుడు, సమన్వయకర్తలు పాఠశాలల్లో ఆన్‌లైన్ ద్వారా ytc.tourism.gov.in వెబ్‌సైట్‌లో తమ బడి వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పర్యాటక వారసత్వ పరిరక్షణకు సంబంధించిన వివిధ కార్యక్రమాలలో విద్యార్థులను భాగస్వాములుగా చేస్తారు. విద్యార్థులు తమ ప్రాంత పర్యాటక స్థలాలపై విస్తృత ప్రచారం చేయడానికి ఈ క్లబ్‌లు దోహదపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

**ఉమ్మడి జిల్లాలో పాఠశాలల వివరాలు..**

| జిల్లా | ప్రాథమికోన్నత | ఉన్నత | విద్యార్థులు |
|---|---|---|---|
| నల్గొండ | 128 | 229 | 51,886 |
| సూర్యాపేట | 81 | 217 | 40,285 |
| యాదాద్రి | 70 | 171 | 32,479 |

## నేటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఓపెన్‌స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. పదో తరగతి పరీక్షలు ఈ నెల 6వ తేదీ వరకు, ఇంటర్మీడియట్ 7వ తేదీ వరకు జరగనున్నాయి. నల్గొండ జిల్లాలో పదో తరగతికి 149 మంది, ఇంటర్‌కు 360 మంది హాజరుకానున్నారు. నల్గొండ డీవీకే రోడ్డులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నారు. సూర్యాపేట జిల్లాలో పదికి 70 మంది, ఇంటర్మీడియట్‌కు 169 మంది పరీక్ష రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

**కో- ఆర్డినేటర్ నియామకం..** ఓపెన్‌స్కూల్ ఉమ్మడి నల్గొండ జిల్లా కో- ఆర్డినేటర్‌గా కె.సత్తమ్మ నియమితులయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆమె రెండు రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కో- ఆర్డినేటర్‌గా పనిచేసిన జగదీశ్ మూడేళ్ల కాలం పూర్తి కావడంతో అతడిని సూర్యాపేట డీఈవో కార్యాలయానికి అటాచ్ చేశారు.

**చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫాంరేటు | 110-00 |
| రిటైల్ | 132-00 |
| డ్రెస్డ్ | 191-00 |
| స్కిన్‌లెస్ | 218-00 |

## కుట్టు శిక్షణ.. ఉపాధికి రక్షణ


కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు, యువతులు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: అందమైన వస్త్రాలు తీర్చిదిద్దే నేర్పు, పట్టుదల, కష్టపడే తత్వం ఉంటే మార్కెట్‌లో టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌కు మంచి గిరాకీ ఉంది. అలాంటి తత్వాన్ని నేర్పిస్తూ మహిళల స్వయం ఉపాధికి దోహదపడేందుకు ఎస్‌బీఐ గ్రామీణ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్‌సెట్) గ్రామీణ స్వయం ఉపాధి సంస్థగా పనిచేస్తోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేని మహిళలను గుర్తించి చేతివృత్తిలో భాగంగా కుట్టు శిక్షణ ఇస్తోంది. ఉచిత కుట్టు శిక్షణ వారి స్వయం ఉపాధికి మార్గం వేస్తోంది. మహిళలు, యువతులకు కుట్టు, అల్లికలు, టైలరింగ్‌లో తర్ఫీదు ఇస్తూ వారి భవిష్యత్తుకు భరోసా నింపుతోంది. మూస పద్ధతుల్లో కాకుండా అధునాతన డిజైన్లు నేర్పుతున్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ధ్రువపత్రాలు అందించి బ్యాంకు ద్వారా రుణాలు తీసుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఆర్‌సెట్ ఆధ్వర్యంలో నల్గొండలో 35 మందికి నెల రోజుల పాటు తరగతులు నిర్వహిస్తారు. థియరీతో పాటు ప్రాక్టికల్స్ ఉంటాయి. ఉచిత భోజన వసతి కల్పిస్తారు.

### కొత్త డిజైన్లకు డిమాండ్..

అంజలి, సజ్జపురం తండా, పాలకవీడు మండలం



నేను ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నా. ఖాళీగా ఇంటి వద్ద ఉండకుండా కుట్టు శిక్షణ పొందుతున్నా. భవిష్యత్తులో ఉపాధికి అవకాశం ఉంటుంది. విపణిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కొత్త కొత్త డిజైన్లు నేర్పిస్తున్నారు. కుట్టు నేర్చుకున్న తరువాత గ్రామంలోనే టైలరింగ్ దుకాణం ఏర్పాటు చేసుకుంటా.

### సద్వినియోగం చేసుకుంటున్నా..

మౌనిక, అల్వాల, నల్గొండ జిల్లా



మహిళలు, యువతులకు కావాల్సిన విధానంలో టైలరింగ్ నేర్పుతున్నారు. సొంతంగా ఆర్థిక ప్రగతి సాధిస్తానన్న నమ్మకం ఉంది. శిక్షణ పూర్తి చేశాక సొంతంగా దుకాణం ఏర్పాటు చేసుకుని కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉంటా.

## అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని సుర్థేపల్లి గ్రామ సమీపంలో అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం అమీనాబాద్‌కు చెందిన గుండు లక్ష్మణ్(35) కొత్తూరు-సుర్థేపల్లి గ్రామాల మధ్య రహదారి వారగా పడి మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. శరీరంపై స్వల్ప గాయాలతో పక్కనే ద్విచక్ర వాహనం పడిపోయి ఉండటాన్ని అటుగా వెళ్తున్న స్థానికులు చూశారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. తన కుమారుడు అనుమానాస్పదంగా మృతి చెందాడని లక్ష్మణ్ తల్లి ఠాణాలో ఫిర్యాదు చేశారు.

## విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా..

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో లారీ ట్రాన్స్‌పోర్టు అసిస్టెంట్ మేనేజర్ దుర్మరణం పాలైన ఘటన పట్టణంలోని కోదాడ రోడ్డులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామానికి చెందిన పెసరమల్లి నరేష్‌బాబు(32) కొన్ని సంవత్సరాలుగా పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. కోదాడ పట్టణంలోని ఓ లారీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజరుగా పని చేస్తున్నారు. రోజు మాదిరిగా మంగళవారం కోదాడలో విధులకు వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా మల్లన్ననగర్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి టిప్పర్ ఢీకొంది. రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి తమ్ముడు ఆదినారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



## పూలధర పూసింది


సూర్యాపేటలో విక్రయానికి పూలు

★ రెండింతలు పెరిగిన వైనం

భానుపురి, కుడకుడరోడ్డు (సూర్యాపేట), న్యూస్‌టుడే: పూల ధరలకు రెక్కలొచ్చాయి. ఏటా వీటి ధరలు పెరుగుతూనే ఉన్నాయి. సామాన్యులు కొనలేనంతగా ఉంటున్నాయి. పండగల వేళ కాకుండా మామూలు రోజుల్లోనూ తగ్గడం లేదు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పూల సాగు తక్కువగా ఉంటుంది. ఒకవేళ చేపట్టినా బంతి రకాలపైనే దృష్టిసారిస్తారు. చామంతి, గులాబీ, సీతజడ, తదితర రకాల పూలను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయటం లేదు. దీంతో ధరలపై ప్రభావం పడుతోంది.

### ధరలు ఇలా..

మార్కెట్లలో వ్యాపారులు చామంతి, గులాబీ, తెల్లచామంతి, బంతి, సీతజడ, తదితర రకాల పూలు విక్రయిస్తుంటారు. చామంతికి గతేడాది కిలో రూ.250 ఉండగా ప్రస్తుతం రూ.400 పలుకుతోంది. గులాబీ పూలు గతేడాది రూ.150 ఉండగా నేడు రూ.400, తెల్లచామంతి గతేడాది రూ.100, ప్రస్తుతం రూ.300, బంతి రూ.50 ఉండగా ప్రస్తుతం రూ.150 ఉంది. ఇలా ధరలు రెట్టింపవటంతో కొనుగోలుదారులు కాస్త ఆచితూచి కొనాల్సిన దుస్థితి నెలకొంది.

★ ఉమ్మడి జిల్లాలో 220 మంది పూల వ్యాపారులున్నారు. కొన్ని పూలకు రెట్టింపుతోపాటు మరి కొన్ని పూలు రెండింతలు ధరలు పెంచారు. ప్రస్తుతం పండగ సీజన్ కావడంతో సామాన్యులు కొనుగోలు చేయాలంటే ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రెండుమూడు కిలోలు ఖరీదు చేసినవారు నేడు కిలోకే పరిమితమయ్యారు. ఒక్క పూలకే ప్రతి ఒక్కరూ రూ.1500 నుంచి రూ.2 వేల వరకు ఖర్చు చేస్తున్నారు.

### ఎక్కడి నుంచి వస్తున్నాయంటే..

స్థానికంగా పూల సాగు తక్కువగా ఉండటంతోపాటు వ్యాపారులు మహారాష్ట్ర, బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. రవాణా ఖర్చులు కూడా గతంలో టన్ను రూ.10,000 ఉండగా నేడు రూ.16,000 వరకు పెరిగింది. ఒక్క టన్నుకే రూ.6 వేలు పెరగటంతో లాభాలు అంతంతగానే ఉంటున్నాయని పలువురు వ్యాపారులు వాపోతున్నారు.

### గతంలో బాగా లాభాలు

– కందుకూరి సన్ని, పూల వ్యాపారి, సూర్యాపేట



గతంలో ధరలు తక్కువగా ఉండటంతో లాభాలు బాగున్నాయి. ప్రస్తుతం ధరలు పెరిగినా రవాణా, కూలీల ఖర్చులు పోను అంతగా లాభాలు ఉండటం లేదు. ముగ్గురు పని వాళ్లు అవసరం. వారికి ఒక్కొక్కరికి నెలకు రూ.20 వేతనం ఇవ్వాల్సి వస్తోంది. అన్ని పోను నెలకు రూ.50 వేల ఆదాయం వస్తుంది. గతేడాది రూ.80 నుంచి 90 వేల వరకు ప్రతి నెలా లాభాలుండేవి.

# నల్గొండ

• నల్గొండ • మునుగోడు • నకిరేకల్




ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కోస్తున్న మండల సాధన సమితి సభ్యులు

## మండల ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

గట్టుప్పల, న్యూస్‌టుడే: మండల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం చౌరస్తా సమీపంలో కేక్ కోసి మండల ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల ఏర్పాటుకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండల సాధన సమితి కన్వీనర్ ఇడం కైలాసం, ముత్తిరెడ్డి, నర్సింహగౌడ్, బాల్‌రెడ్డి, రమేష్, సత్తయ్య, యాదయ్య, రాంబాబు, కృష్ణయ్య పాల్గొన్నారు.

## నిత్యావసర సరకులు పంపిణీ

చండూరు: ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోడి శ్రీనివాసులు బుధవారం చండూరుకు చెందిన నిరుపేదలకు రూ.వెయ్యి విలువ చేసే నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. గాంధీజీ విద్యాసంస్థల కరస్పాండెంట్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపల్ సత్యనారాయణ మూర్తి, యాదయ్య, యాదగిరి, గణేష్, విజయ్, గోపి పాల్గొన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM) 80085 52710, 80085 66199, 8008574421, 80085 74385

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? నల్గొండలోని మునుగోడు రోడ్డు హౌసింగ్‌బోర్డుకాలనీలో పందులు ఇళ్ల మధ్యన స్వైరవిహారం చేస్తున్నాయి. మున్సిపల్ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకుపోయిన పట్టించు కోవడం లేదు.
– నాగభూషణం, నల్గొండ.

✔ పందుల పెంపకం దారులకు నోటీసులు జారీచేస్తాం. తదుపరి అవసరమైన చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాస్,శానిటరీ ఇన్‌స్పెక్టరు, నల్గొండ పురపాలిక.

## 'ఎస్సీల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం'

నకిరేకల్, న్యూస్‌టుడే: కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నకిరేకల్‌లోని అమరవీరుల స్మారక భవన్‌లో బుధవారం నిర్వహించారు. కేవీపీఎస్ పతాకాన్ని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వంటెపాక కృష్ణ ఆవిష్కరించారు. నాయకులు వి.వెంకటేశ్వర్లు, ఏ.నగేశ్, వి.నాగార్జున, వి.జమదగ్ని పాల్గొన్నారు.

నల్గొండ గ్రామీణం: నల్గొండలో కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాల



కేవీపీఎస్ జెండా ఎగురవేస్తున్న ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగార్జున

గుడు నాగార్జున మాట్లాడారు. ఎస్సీల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ, రవీందర్, పోలే సత్యనారాయణ, కృష్ణ, సైదులు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఇరుగు జశ్వంత్

కట్టంగూరు, న్యూస్‌టుడే: మండలంలోని చెర్వు అన్నారం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి ఇరుగు జశ్వంత్ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ క్రీడా పోటీలకు ఎంపికయ్యాడని ఆపాఠశాల హెచ్‌ఎం కె.రమ, వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్. పుల్లయ్య తెలిపారు. ఈనెల 3 నుంచి 5 వరకు నారాయణపేట జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్-17 విభాగంలో హ్యాండ్ బాల్ చాంపియన్ షిప్ క్రీడలో నల్గొండ జిల్లా జట్టు తరపున పాల్గొంటారని పేర్కొన్నారు.

# చిన్నారుల చిత్రవిచిత్రాలు

మునుగోడు, న్యూస్‌టుడే: ఈ బాలికలు చదువుకే పరిమితం కాకుండా తమలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీస్తే రాణిస్తున్నారు. అందమైన బొమ్మలను గీస్తూ తోటి విద్యార్థులతో పాటు టీచర్లను ఆశ్చర్యానికి గురి చేస్తున్నారు. చదివే పాఠశాలలు గోడలపై వీరు వేసిన చిత్రాలను చూస్తే ఇంత అందంగా వేశారా అని చూడాల్సిందే. నల్గొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలోని బీసీ బాలికల గురుకుల విద్యాలయంలోని తరగతి గదులతో పాటు వరండాలో వేసిన చిత్రాలను చూస్తుంటే గొప్ప ఆర్టిస్ట్‌లే వేసినట్లు కనిపిస్తున్నాయి.



మునుగోడు బీసీ బాలికల గురుకుల విద్యాలయంలోని ఓ గోడపై అందంగా వేసిన చిత్రం

### మెలకువలను నేర్పిస్తున్నాను:

– కవిత, ఆర్ట్ టీచర్, మునుగోడు

విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా చిత్రలేఖనంలో మెలకువలను నేర్పిస్తూ మరింత ప్రోత్సాహం అందిస్తున్నాం. ఇప్పటి వరకు సుమారుగా 40 మంది బాలికలు వివిధ స్థాయి పోటీలకు వెళ్లేలా శిక్షణ ఇచ్చాను. చిత్రలేఖనంలో పట్టు ఉన్న విద్యార్థులు వృత్తి విద్య కోర్సుల్లో సైతం రాణించగలుగుతారు. బొమ్మను శ్రద్ధతో వేయడం వల్ల ఏకాగ్రత కూడా పెరుగుతుంది.

### తరగతి గదిలో బొమ్మలు వేశాను:

– రమ్య, తొమ్మిదో తరగతి



భవిష్యత్తులో చదువులో ఉన్నతమైన స్థానానికి ఎదగడంతో పాటు గొప్ప ఆర్టిస్ట్‌గా రాణించాలనే పట్టుదలతో ఉన్నాను. చిత్రలేఖనంలో ఏ స్థాయి పోటీలు నిర్వహించిన వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తాను. మాతరగతి గదిలో సైతం గోడలపై ఎన్నో బొమ్మలను వేశాను.

### ముఖ చిత్రాలను వేయగలుగుతాను:

– తేజ, తొమ్మిదో తరగతి విద్యార్థిని



మనుషుల ముఖచిత్రాలను చూడగానే వేయగలుగుతాను. సమాజంలో జరిగే నేరాల బొమ్మలను సొంతంగా ఊహించి వేస్తాను. ప్రకృతిలో ఉన్న ప్రతి దృశ్యాన్ని సహజంగా కనిపించే విధంగా గీయగలుగుతాను. 2023-24 సంవత్సరంలో నల్గొండలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని ప్రశంసాపత్రం పొందాను.

### ఏ బొమ్మనైనా గీసేస్తా:

– నందిని, పదో తరగతి విద్యార్థిని



నాలుగో తరగతి నుంచే బొమ్మలను గీయడం అలవాటుగా మార్చుకున్నాను. ఏ చిత్రమైనా నిమిషాల వ్యవధిలోనే అవలీలగా గీయగలుగుతాను. బొమ్మలు గీయడం వల్ల మేధశక్తి మెరుగు పడుతుంది. చదువులో సైతం రాణించగలుగుతున్నాను. చాలా పోటీలలో పాల్గొని ఎన్నో బహుమతులను సాధించాను.

## 'ఏడుకోలల బాయి' పుస్తక ఆవిష్కరణ

చిట్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రముఖ కవి, సాహితీవేత్త డా. ఏనుగు నరసింహారెడ్డి రచించిన 'ఏడుకోలల బాయి' పుస్తకాన్ని బుధవారం వట్టిమర్తిలో సృజన సాహితీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని మాజీ శాసన సభ్యుడు దివంగత నర్రా రాఘవరెడ్డికి అంకితం ఇస్తున్నట్లు నరసింహారెడ్డి ప్రకటించి అనంతరం వినూత్నంగా గ్రామానికి చెందిన సిరిపంగి భాగ్య అనే



వట్టిమర్తిలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సృజన సాహితీ సభ్యులు

మహిళచే పుస్తకాన్ని ఆవిష్కరించారు. సృజన సాహితీ అధ్యక్షుడు పెరుమాళ్ల ఆనంద్ మాట్లాడుతూ నర్రా రాఘవరెడ్డి మార్గంలో ఈ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ప్రధాన కార్యదర్శి సాగర్ల సత్తయ్య మాట్లాడుతూ భారత ఎన్నికల వ్యవస్థలో ఉన్న లొసుగులను, రాజకీయాల్లో ప్రవేశించిన అవినీతిని, ప్రస్తుత రాజకీయాలను ప్రక్షాళన చేయాల్సిన ఆవశ్యకతను, పరిష్కార మార్గాలను సూచించే ఎన్నికల శతకం ఏడుకోలల బాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కవులు ఆంజనేయులు, నర్సింహా, శ్రీనివాస్, భీమార్జున్ రెడ్డి, నగేశ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గీతకార్మికుల ఆధునిక మోకుపై శిక్షణ

కనగల్,న్యూస్‌టుడే: కల్లుగీత కార్మికులకు కాటమయ్య ఆధునిక మోకు ఉపయోగించడంపై మండలంలోని జి.యడవల్లి గ్రామంలో హైదరాబాద్ నుంచి వచ్చిన శిక్షకులతో పాటు ఎక్సైజ్ పోలీసులు గీతాకార్మికులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ శాఖ సీఐ బి. ప్రసాద్ మాట్లాడారు. గీత కార్మికులు చెట్టు ఎక్కినప్పుడు ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందడం, గాయాలపాలవుతున్నారని తెలిపారు. రక్షణ కవచం ఉండటం వల్ల తాడు మధ్యలో అనుకోకుండా కాలు జారినప్పటికీ ఎలాంటి ప్రమాదం ఉండదన్నారు. సేఫ్టీ మోకులతో తాటి చెట్లను ఎక్కే పద్ధతిని చూపించారు. ఎక్సైజ్ ఎస్సై బాలవర్ధన్, ట్రైనర్ కొండ వెంకటేశం, కర్నాటి పెద్దగిరి, వెంకన్న, హరి నారాయణ పాల్గొన్నారు.

## ముస్తాబవుతున్న మండపాలు

చండూరు, న్యూస్‌టుడే: నేటి నుంచి దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న సందర్భంగా చండూరు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో, పురపాలికల్లో అమ్మవారిని ప్రతిష్ఠించేందుకు మండపాలను అందంగా ముస్తాబు చేస్తున్నారు. ఈ మండపాలలో అమ్మవారిని ప్రతిష్ఠించి ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు తొమ్మిది రోజుల



దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చండూరులోని హనుమాన్ నగర్ అందంగా ముస్తాబైన మండపం

పాటు తొమ్మిది రూపాలలో వైభవంగా పూజలు నిర్వహిస్తుంటారు. ఈ అమ్మవారి సంబరాలు నిర్వహించేందుకు గానూ ఉత్సవ కమిటీ నిర్వాహకులు వారం రోజుల ముందే మండపాల తయారీలో హడావుడి చేస్తూ ప్రజల దృష్టిని మరల్చేందుకు పోటీ పడి మండపాలను ప్రత్యేక ఆకర్షణ పొందేందుకు అందంగా ముస్తాబు చేస్తున్నారు.

# పూల మాల వేసి.. నివాళి అర్పించి



నల్గొండ: గాంధీ విగ్రహానికి పూల మాల వేస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, తదితరులు

మునుగోడు, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా గాంధీజీ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సభలు నిర్వహించారు. స్థానికంగా ఎమ్మెల్యే వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



నల్గొండ: నివాళులు అర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పుర ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

ఇప్పర్తి గ్రామ చౌరస్తాలో ఉన్న గాంధీ విగ్రహానికి భాజపా నాయకులు పూల మాలలు వేశారు.

చండూరు: గాంధీ జయంతి వేడుకలు బుధవారం చండూరులో కాంగ్రెస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడారు. పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు వెంకటేశ్ యాదవ్, శ్రీనివాసులు, మాజీ సర్పంచి గిరిబాబు, మల్లేష్, సంజయ్, శేఖర్ ఉన్నారు.



చండూరులో.. నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నీలగిరి: జిల్లా వ్యాప్తంగా గాంధీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. నల్గొండలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీ జయంతి సందర్భంగా భాజపా ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

నల్గొండ గ్రామీణం: నల్గొండలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో శ్రీదేవి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

నల్గొండ జిల్లా పరిషత్తు: నల్గొండలోని రామగిరి కూడలిలో గాంధీ విగ్రహానికి డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పుర ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

నల్గొండ టౌన్: ఎంజీ యూనివర్సిటీలో రిజిస్ట్రార్ అల్వాల రవి, నీలగిరి డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపల్ నాగేందర్‌రెడ్డి గాంధీ చిత్రపటాల వద్ద నివాళి అర్పించారు.

నల్గొండ అర్బన్: వాత్సల్య దివ్యాంగుల సేవా సంస్థ ఆధ్వర్యంలో అనాథ వృద్ధుల ఆశ్రమంలో దుస్తులు, పాలు, పండ్లు పంపిణీ చేసి ఆ సంస్థ అధ్యక్షుడు అంజిరెడ్డి మాట్లాడారు.



నకిరేకల్: గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి, భారాస నాయకులు

నకిరేకల్: నకిరేకల్‌లో గాంధీ విగ్రహానికి పుర ఇన్‌ఛార్జి ఛైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పూజర్ల శంభయ్య, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుకన్య, ఎమ్మెల్యే సతీమణి పుష్ప, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి యాతాకుల అంజయ్యలు వేరువేరుగా నివాళులు అర్పించారు.

కేతేపల్లి: మండల కేంద్రంలో ఎంపీడీవో శ్రీనివాసరావు గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు.

చిట్యాల: స్థానిక పుర కార్యాలయంలో పురఛైర్మన్ వెంకట్‌రెడ్డి, కమిషనర్ గాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పించి పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు.

### గాంధీ విగ్రహానికి వెండి కిరీటం బహూకరణ

చిట్యాల గ్రామీణం: పెద్దకాపర్తి శివారులోని గాంధీగుడి నిర్మాణం చేసి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆలయంలో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లాకు చెందిన భక్తులు బహూకరించిన వెండి కిరీటంను ఆయన గాంధీ విగ్రహానికి ధారణ చేశారు. జోగినపల్లి శ్రీనివాసరావు, కాటం వెంకటేశం, వనమా వెంకటేశ్వర్లు, కందిమల్ల శిశుపాల్‌రెడ్డి, బుద్ధుడు తదితరులు పాల్గొన్నారు.



వెండి కిరీటాన్ని గాంధీ విగ్రహానికి ధారణ చేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

## 12ఏళ్ల సమస్య పరిష్కారానికి ఆమోదం

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: ఇటీవల ఈనాడులో వచ్చిన వరస కథనాలతో జిల్లా కేంద్రంలోని మర్రిగూడ బైపాస్ నుంచి చంద్రగిరి విల్లాస్‌కాలనీ రోడ్డుకు మోక్షం లభించింది. చంద్రగిరివిల్లాస్ కాలనీతో పాటు బాలాజీ కాలనీ రోడ్లకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం ఉదయం 10 గంటకు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. రెండు కాలనీలకు కిలో మీటర్‌కు పైగా 24 అడుగుల వెడల్పుతో బీటీ రోడ్డు వేయడానికి పురపాలిక నిధుల నుంచి అధికారులు రూ.కోటి కేటాయించారు. దీంతో గత 12 ఏళ్లుగా రోడ్ల నిర్మాణానికి నోచుకోని ఈ సమస్యకు పరిష్కారం లభించడంతో ఆ ప్రాంత వాసులు ఆనందంతో ఉన్నారు.



చంద్రగిరి విల్లాస్ కాలనీ రోడ్డు దుస్థితి ఇలా..

స్పందనకు వందనం

## ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి

గట్టుప్పల: నూతనంగా ఏర్పాటైన గట్టుప్పల మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలను వెంటనే ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశానికిహాజరై మాట్లాడారు. ఎంపీడీవో, పీహెచ్‌సీ, వ్యవసాయ, విద్యుత్, మండల పశువైద్యశాల, కార్యాలయాలను ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రజలు అసౌకర్యాలకు గురవుతున్నారని, ప్రభుత్వం చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండల కార్యదర్శి మల్లేశం, ధనంజయ్యగౌడ్, శివ కుమార్, సుధాకర్ గౌడ్, నర్సింహ, రాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రమాదం చెంతన వంతెన



నల్గొండ పురపాలిక, న్యూస్‌టుడే: నల్గొండలో పెద్దబండ నుంచి కలెక్టరేటు వెళ్లే మార్గంలో రోడ్డు విస్తరణలో భాగంగా వంతెన(కల్వర్టు) నిర్మాణానికి గత ఏడాది శ్రీకారం చుట్టారు. దానికి రక్షణ గోడ నిర్మాణానికి పదునైన ఇనుప రాడ్లు ఏర్పాటు చేసి కాంక్రీటు నిర్మాణ పనులు నిలిపివేశారు. నిత్యం వందల సంఖ్యలో వాహనదారులు మార్గం ద్వారా ప్రయాణిస్తుంటున్నారు. ఏమాత్రం ఐరన్ రాడ్లకు తాకిన పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. మరో పక్క స్టీలు రాడ్లు వానకు తుప్పపట్టి పనికి రాకుండా పోతున్నాయి. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి సీసీ పనులు పూర్తి చేయించాల్సిన అవసరం ఉంది.

ప్రమాదకరంగా కల్వర్టు గోడనిర్మాణానికి ఏర్పాటు చేసిన ఇనుప రాడ్లు

# తీరొక్క పువ్వేసి చందమామ

### ఘనంగా బతుకమ్మ సంబురాలు



చండూరులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు

బతుకమ్మ పండుగ సంబరాలను బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. ఆయా గ్రామాల చౌరస్తాలు, దేవాలయాల వద్దకు తీసుకొచ్చి వాటి చుట్టూ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడుతూ సందడి చేశారు. అనంతరం చెరువులు, కుంటలలో నిమజ్జనం చేశారు. చాలా రోజుల తర్వాత మహిళలంతా ఒకే చోట కలుసుకోవడంతో ఎంతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. పల్లెలు, పట్టణాల్లో బతుకమ్మ సందడితో మారుమోగింది.

న్యూస్‌టుడే, బృందం:



నకిరేకల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కట్టంగూరు: ఇస్మాయిల్‌పల్లిలో..



చిట్యాలలో..





చిట్యాల: పట్టు చీరను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొస్తున్న భక్త మార్కండేయ పద్మశాలి సంఘం సభ్యులు



కనగల్‌లో..



మాడ్గులపల్లి: ఇందుగులలో..



నల్గొండ నీలగిరి జూనియర్ కళాశాలలో..

## అవీ ఇవీ

**విస్తృత సేవలు..** నకిరేకల్: నిరుపేదలే లక్ష్యంగా తమ క్లబ్ శాఖలు విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని వాసవి క్లబ్ అంతర్జాతీయ సమన్వయకర్త బ్రహ్మదేవర పద్మావతి చెప్పారు. మహాలయ అమావాస్య సందర్భంగా నకిరేకల్ వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించి మాట్లాడారు. వనిత క్లబ్ అధ్యక్షురాలు వి.రాధిక, కార్యదర్శి కె.భవాని, కోశాధికారిణి ఎస్.శ్రీలత, దాత ఎస్.హర్షిణి, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు బి.రాంమోహన్ పాల్గొన్నారు.

**వృద్ధులకు వైద్య పరీక్షలు..** నకిరేకల్: నకిరేకల్‌లోని లయన్స్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఐఎంఏ ప్రతినిధి డా.ఆర్.వీరబ్రహ్మం శిబిరంలో సేవలందించారు. చరిత్ర పరిశోధకుడు డా.డి.సూర్యకుమార్ వృద్ధులకు అన్నదానం చేశారు. లయన్స్‌క్లబ్ జిల్లా ఛైర్మన్ ఎన్.రాంమోహన్ రావు, క్లబ్ అధ్యక్షుడు బి.ప్రకాశరావు పాల్గొన్నారు.

**సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మృతి..** శాలిగౌరారం: శాలిగౌరారానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు యలమయ్య(68) అనారోగ్యంతో మృతి చెందారు. కాంగ్రెస్ నాయకులు చాడ సురేష్‌రెడ్డి, అన్నెబోయిన సుధాకర్, జైపాల్‌రెడ్డి, రాజు, వెంకన్న, నగేష్, తదితరులు నివాళి అర్పించారు.

**పిడుగుపాటుకు రెండు ఆవుల మృత్యువాత..** కట్టంగూరు: చెర్వుఅన్నారంలో బుధవారం సాయంత్రం పిడుగు పడటంతో మేతకు వెళ్లిన రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. వ్యవసాయ పనుల కోసం రూ.70 వేలతో నాలుగు నెలల క్రితం కొనుగోలు చేసినట్లు బాధితుడు సూరారపు గిరి తెలిపారు.

**చరవాణి అప్పగింత..** మాడ్గులపల్లి: ఇందుగుల గ్రామానికి చెందిన కిన్నెర మైసయ్య గత నెల 7న సెల్ పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ దరఖాస్తు ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి ఎస్సై కృష్ణయ్య బుధవారం అందజేశారు.

**గిరిజన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి..** నల్గొండ విద్యావిభాగం: తెలంగాణ ట్రైబల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల పదోన్నతులు, అవార్డులు పొందిన గిరిజన ఉపాధ్యాయులను హైదరాబాద్‌లో సన్మానించారు. ఇటీవల రాష్ట్రం నుంచి జాతీయస్థాయికి నామినేట్ అయిన మర్రిగూడ మండలం దామెర భీమనపల్లి పీఎస్ హెచ్ఎం ఉదావత్ లచ్చిరాంను ప్రభుత్వ విప్ జాటోతు రాంచందర్ నాయక్ సత్కరించారు. ఈ సందర్భంగా లచ్చిరాం మాట్లాడుతూ గిరిజన ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందచేశారు.

**శిక్షణ శిబిరం..** మర్రిగూడ: మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా చేసే నీటి సహాయకులకు గురువారం నుంచి నాలుగు రోజుల పాటు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు చింతపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సంబంధిత శాఖ నిపుణులతో శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## మద్యం పట్టివేత

మర్రిగూడ, న్యూస్‌టుడే: అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలుంటాయని ఎస్సై రంగారెడ్డి హెచ్చరించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని కుదాబక్షుపల్లి గ్రామ పంచాయతీకి చెందిన ఆవాస ప్రాంతం సాయిబండ తండాకు చెందిన ఓ మహిళ మంచాల మండలం లోయపల్లి గ్రామంలోని మద్యం దుకాణం నుంచి బీరు సీసాలను కొనుగోలు చేసి తీసుకొచ్చి తన ఇంట్లో అమ్ముతుండగా దాడి చేసి పట్టుకున్నామని, పట్టుబడిన మద్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు.

## ట్రాక్టరు చోరీ దొంగల అరెస్టు, రిమాండ్

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: ట్రాక్టరును చోరీ చేసిన ఇద్దరు దొంగలను ఆత్మకూర్(ఎస్) పోలీసులు పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్ చేశారు. ఎస్సై వై.సైదులు తెలిపిన వివరాల మేరకు.. నల్గొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన సంపంగి దుర్గాప్రసాద్ బండరాయి కొట్టేందుకు గతంలో ఆత్మకూర్(ఎస్), గుడితండా గ్రామాలకు వచ్చాడు. గుడితండాకు చెందిన ధరావత్ రవి ట్రాక్టరును కౌలు వ్యవసాయ క్షేత్రం వద్ద ఉంచాడు. అక్కడే బండరాయి కొట్టిన దుర్గాప్రసాద్ దానిని దొంగతనం చేయాలని పన్నాగం పన్నాడు. సెప్టెంబరు 21న అర్ధరాత్రి నకిరేకల్ నుంచి వచ్చిన నిందితుడు సూర్యాపేటలో తన బంధువు పసుపుల రవిని తీసుకొని వచ్చి.. ట్రాక్టర్‌ని తీసుకెళ్లారు. అపహరించిన ట్రాక్టరును నిందితులు మహబూబాబాద్‌లో విక్రయించేందుకు మంగళవారం వెళ్లగా అక్కడ పత్రాలు లేవని ఎవరూ కొనలేదు. దీంతో ఇద్దరు తిరిగి వస్తుండగా.. పాతర్ల పహాడ్ స్టేజీ వద్ద పోలీసుల తనిఖీలో పట్టుబడ్డారు. నిందితులనుంచి ట్రాక్టరు, ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దుర్గాప్రసాద్‌పై గతంలో కేతేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ట్రాక్టరు దొంగతనం కేసు నమోదైంది. సూర్యాపేట డీఎస్పీ రవి ఆధ్వర్యంలో గ్రామీణ సీఐ సురేందర్‌రెడ్డి, సీసీఎస్ సీఐ శివకుమార్, స్థానిక ఎస్సై, సీసీఎస్ ఎస్సై, సిబ్బంది కలిసి కేసు ఛేదించనట్లు తెలిపారు.

## సినిమాలు

నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **నటరాజ్:** దేవర, **తిరుమల:** సత్యం సుందరం, **వెంకటేశ్వర:** మత్తు వదలరా 2

నకిరేకల్: **రామకృష్ణ**- సత్యం సుందరం, **వెంకటేశ్వర**- దేవర

# మిర్యాలగూడ

•మిర్యాలగూడ •నాగార్జునసాగర్ •దేవరకొండ

## డిజిటల్ పైలెట్ గ్రామంగా అచ్చంపేటపల్లి

చందంపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేపడుతున్న కుటుంబ డిజిటల్ హెల్త్ కార్డు ప్రొఫైల్ రూపకల్పనకు ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఇందుకు పైలెట్ సర్వే కింద చందంపేట మండలం అచ్చంపేటపల్లి గ్రామం ఎంపికైనట్లు తెలిపారు. గ్రామంలోని 169 కుటుంబాలకు హెల్త్ ప్రొఫైల్‌ను రూపొందించి, ప్రత్యేక నంబరుతో స్మార్ట్‌కార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు. గురువారం నుంచి ఈ నెల 7 వరకు నిర్వహించే ప్రొఫెలెట్ సర్వేలో భాగంగా రెవెన్యూ సిబ్బంది ఎంపిక చేసినట్లు తెలిపారు. అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఆ కార్డు కోసం ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు బుధవారం తెలిపారు.

## నేటి నుంచి పైలట్ సర్వే

త్రిపురారం, న్యూస్‌టుడే: మండలంలోని కొణతాలపల్లిలో నేటి నుంచి 8వ తేదీ వరకు హెల్త్‌కార్డు పైలట్ సర్వేను రెండు బృందాల ద్వారా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయకుమారి తెలిపారు. బుధవారం మాట్లాడుతూ గ్రామంలో ఉన్న కుటుంబాలను సర్వే చేయనున్నట్లు చెప్పారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) 77994 92939 99121 74975 98487 81656

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో పక్క కాల్వల్లో వ్యర్థాలు తొలగించకపోవడంతో మురుగు నిలిచి.. దుర్వాసన వస్తుంది.
– జానీ, మిర్యాలగూడ

✔ కాల్వల్లో వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.
– ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ

## సమాజ సేవలో ముందుండాలి

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: ఆర్యవైశ్యులు సంపంతో పాటు సమాజ సేవలో ముందుండాలని మాజీ వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సముద్రాల ధనయ్య, దాచేపల్లి నరేందర్, కర్నాటి శ్రీనివాస్‌లను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంఘం ప్రతినిధులు నీల లక్ష్మయ్య, చుండూరి వెంకటేశ్వర్లు, ఆకుతోట లక్ష్మీ నారాయణ, ధనుంజయ్య, వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమల్ రెడ్డి, మాజీ ఉపసర్పంచి సురేష్, సుధాకర్ పాల్గొన్నారు.



పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులను సన్మానిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు

**స్కూల్ బ్యాగుల పంపిణీ...** పెద్దఅడిశర్లపల్లి : గుడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక యూత్ ఫర్ సేవ సంఘం నల్గొండ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల విద్యాధికారి ఎస్. శ్రీనయ్య చేతుల మీదుగా మంగళవారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. సేవా సంఘం సభ్యుడు గోలి శ్యామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి కృషి

మాడ్గులపల్లి, న్యూస్‌టుడే: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. వేములపల్లి మండలంలోని ఆమనగల్లు శ్రీరామ లింగేశ్వరస్వామి దేవాలయాన్ని బుధవారం సందర్శించారు. కోనేరు, రాజగోపురం, ట్యాంకు తదితర సౌకర్యాల ఏర్పాటు కోసం అంచనా వేయాలని సూచించారు. ఆయన వెంట ఆలయ అర్చకులు సతీశ్‌శర్మ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాంతారెడ్డి, ఛైర్మెన్ వెంకటేశ్వర్లు, ఎండోమెంట్ డీఈ రాజేశ్వరరావు, దామోదర్, రాజయ్య, మృత్యుంజయ శాస్త్రి పాల్గొన్నారు.

## మౌలిక వసతుల ఏర్పాట్లు..

# వ్యాపారులపై నిఘా

ముఖాముఖి

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం అమ్ముకునేందుకు గాను మిర్యాలగూడ మండలం అవంతీపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి వెంకటేశం తెలిపారు. ఖరీఫ్ ధాన్యం కోతల సీజన్ ప్రారంభమైన సందర్భంగా 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో ఆయన పలు వివరాలు వెల్లడించారు.



వెంకటేశం, మిర్యాలగూడ మార్కెట్ కార్యదర్శి

### సన్నరకం ధాన్యం పండించడమే కారణం..

రైతులు గతంలో 1010 రకం ధాన్యం పండించగా మార్కెట్‌లోనే తెచ్చి విక్రయాలు సాగించేవారు. ఇక్కడ కొనుగోలు చేసిన వారి రసీదుల ఆధారంగా పౌరసరఫరాల వారు భారత ఆహార సంస్థకు లెవీ పెట్టేలా మిల్లర్లకు అనుమతులు ఇచ్చేవారు. ప్రస్తుతం సన్నరకం ధాన్యం పండిస్తుండటం తేమ ఉన్నప్పుడే మిల్లింగ్ చేయాల్సినందు వల్ల నేరుగా మిల్లుల వద్దకే రైతులు వెళ్తున్నారు. దీంతో మార్కెట్‌కు ధాన్యం రావటం లేదు. దొడ్డురకం మాత్రమే వస్తుంది.



### భారీ వాహనాలు అనుమతించం..

పశువులను సంత నుంచి కబేళాకు తరలించే కొందరు వ్యాపారులపై నిఘా ఏర్పాటు చేశాము. రైతులు తమ అవసరాలకు అమ్మకం కొనుగోళ్లు చేసుకునేలా చూస్తున్నాము. మార్కెట్‌లోకి భారీ వాహనాలు అనుమతించటం లేదు.

### సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉంటారు..

ఇటీవల జిల్లా అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశంలో అవంతీపురం మార్కెట్ యార్డులో ఐకేపీ, పీఏసీఎస్‌లతో రెండు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయా కేంద్రాలకు అవసరమైన తూకం యంత్రాలు, తాగునీటి వసతి ఏర్పాటు చేస్తున్నాము. ధాన్యం తీసుకొచ్చే రైతులకు అవసరమైన పట్టాలు, వర్షం వస్తే ధాన్యం కప్పేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాము. సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండి పర్యవేక్షిస్తారు.

### గతంలో పరిస్థితి గురించి వివరాలు సేకరిస్తాను..

నేను ఇటీవలే బాధ్యతలు స్వీకరించాను. గతంలో వ్యాపారులు తప్పుడు అమ్మకాల ద్వారా జీఎస్టీ ఎగవేతకు పాల్పడిన విషయంలో వారికి భారీగా జరిమానాలు చెల్లించేవారని తెలుసుకున్నాను. ఆ పరిస్థితుల గురించి వివరాలు సేకరిస్తున్నాను. నిబంధనల ప్రకారం ఉన్నతాధికారుల అనుమతితోనే వ్యాపారుల నుంచి మార్కెట్ సెస్ వసూలు చేస్తాను.

### రూ.30 కోట్ల ఆదాయం సమకూరింది..



గతేడాది మార్కెట్‌కు రూ. 28 కోట్లు ఆదాయం లక్ష్యంగా ఉన్నతాధికారులు నిర్ణయించగా ఆశించిన దానికంటే ఎక్కువగా మొత్తం రూ. 30 కోట్ల ఆదాయం సమకూరింది.

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట: మంత్రి

చింతపల్లి, న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి బుధవారం మాల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొంతం అలివేలు భర్త దొంతం సంజీవరెడ్డి మంత్రి వెంకటరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. రైతులు తీసుకువచ్చే ధాన్యం, పత్తికి గిట్టుబాటు ధర కల్పిస్తామని, మార్కెట్ యార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సంజీవరెడ్డిని మంత్రి సన్మానించారు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండ్లపల్లి నర్సింహారెడ్డి, కొప్పుల అశోక్‌గౌడ్ ఉన్నారు.



సంజీవరెడ్డిని సన్మానిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

## సినిమాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

**రాఘవ:** దేవర, **వెంకటేశ్వర:** దేవర, **శ్రీనివాస:** సత్యం సుందరం, **విట్రోస్:** మత్తు వదలరా-2, దేవర, సత్యం సుందరం

# మహాత్ముడి అడుగు జాడల్లో నడవాలి

జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను బుధవారం మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. మిర్యాలగూడలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో మహాత్ముడి చిత్రపటానికి సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, కాంగ్రెస్ కార్యాలయంలోని మహాత్మాగాంధీ చిత్రపటానికి, పట్టణంలోని గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే బీఎల్ఆర్ పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో తదితర పార్టీల నాయకులు, అధికారులు పాల్గొని నివాళులర్పించారు.
– న్యూస్‌టుడే, బృందం



మిర్యాలగూడ: సబ్ కలెక్టర్ కార్యాలయంలో మహాత్ముడి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్



మిర్యాలగూడ కాంగ్రెస్ కార్యాలయంలో.. ఎమ్మెల్యే బీఎల్ఆర్, తదితరులు



నాగార్జునసాగర్: నందికొండ పురపాలక సంఘం కార్యాలయంలో..



త్రిపురారంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..



మిర్యాలగూడలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో.. రక్తదాన శిబిరం



గుర్రంపోడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

### స్వచ్ఛతవైపు అడుగేద్దాం

సత్యం, అహింస నినాదాలతో దేశ ప్రజల ఆకాంక్ష అయిన స్వాతంత్ర్య ఫలాలు అందించిన మహాత్మా గాంధీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని ఎమ్మెల్యే బీఎల్ఆర్ అన్నారు. పట్టణంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి మాట్లాడారు. ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా భూమిలో కలిసి పోయే సంచులను ప్రదర్శించి.. ప్రజా ప్రతినిధులు, నాయకులు, వ్యాపారుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్వచ్ఛ మిర్యాలగూడ కార్యక్రమంలో భాగంగా పలు వీధుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు.
– న్యూస్‌టుడే, మిర్యాలగూడ పట్టణం



దేవరకొండలో.. మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్



కొండమల్లేపల్లి చౌరస్తాలో..



# ఎంగిలి పూలు... ఎద నిండెను చూడు..

మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాల్లో బుధవారం ఎంగిలి పూల బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పట్టణాల్లోని పలు ఆలయాలు, వార్డుల్లోని కూడళ్లలో మహిళలు, యువతులు, చిన్నారులు ఒకచోట చేరి బతుకమ్మ పాటలకు నృత్యాలు చేశారు. హాలియాలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ తన నివాసంలో కుటుంబసభ్యులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ఆడారు. – న్యూస్‌టుడే, బృందం



మిర్యాలగూడలోని బచ్‌పన్ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు





చింతపల్లి: వీటీనగర్‌లో

దేవరకొండ వాసవి కన్యాక పరమేశ్వరి దేవాలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



దేవరకొండ పట్టణంలో చిన్నారి...



హాలియా సాయిప్రతాప్‌నగర్ కాలనీలో.. పుర ఛైర్‌పర్సన్ అనుపమరెడ్డి



హాలియా: శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద...



మిర్యాలగూడ చింతపల్లి ఇందిరమ్మ కాలనీలో..

## అవీ ఇవీ

**వినతి...** చింతపల్లి: ఘడియగౌరారంలో కోతులు, కుక్కల బెడదతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని బుధవారం గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. పున్న భీమేష్, గుర్రం విష్ణు, పల్లపు ఈశ్వర్, కంబాలపల్లి నరేష్, నడింపల్లి శ్రీనివాస్, గండికోట కృష్ణయ్య పాల్గొన్నారు.

**జీ-పార్క్ సదస్సుకు ఎంపిక...** తిరుమలగిరి సాగర్ : మండలంలోని నాగార్జునపేటకు చెందిన ఆంగోతు స్వామి నాయక్ అనే వైద్య నిపుణుడు జీ-పార్క్ సదస్సుకు బుధవారం ఎంపికయ్యారు. నేటి నుంచి ఐదు రోజుల పాటు హైదరాబాద్‌లోని ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ అకాడమి ఆఫ్ ఇండియా, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ప్రష్యాన్ సస్టైనబుల్ హెల్త్ అవుట్ కమ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న జీ-పార్క్ సదస్సుకు ఎంపిక కావడంపై గ్రామస్థులు అభినందనలు వ్యక్తం చేశారు.

**స్వచ్ఛతకు ప్రాధాన్యమివ్వాలి...** కొండమల్లేపల్లి: ప్రతి ఒక్కరూ స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలని, సమస్యలుంటే నేరుగా గ్రామపంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి రాంరెడ్డి తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామసభకు అంతగా ప్రజలు హాజరు కాకపోవడం గమనార్హం.

**కొండాసురేఖపై అనుచిత వ్యాఖ్యలు తగదు...** దామరచర్ల: మంత్రి కొండాసురేఖపై భారాస నాయకులు కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలు ఆ పార్టీ వైఖరిని తెలియజేస్తుందని బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్ అన్నారు. బుధవారం దామరచర్లలో విలేకరులతో ఆయన మాట్లాడారు. బీసీ వర్గానికి చెందిన మంత్రి సురేఖపై ఇష్టానుసారంగా సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేయడం తగదన్నారు. కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఖాదర్, అల్లంనాగరాజు, బాలునాయక్, కృష్ణనాయక్ తదితరులున్నారు.

## కృష్ణకాంత్ మార్గం అనుసరణీయం

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొర్ర కృష్ణకాంత్ మార్గం అనుసరణీయమని, ఆయనను ఆదర్శంగా తీసుకొని ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు కృషిచేయాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రుడునాయక్ అన్నారు. ట్రైబల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన కృష్ణకాంత్‌ను శాలువా, పూలదండతో సన్మానించారు. ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్యనాయక్, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రునాయక్, టీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనునాయక్, బీమ్లానాయక్, లచ్చిరాంనాయక్, సంజీవ్‌నాయక్ ఉన్నారు.

## ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(లియాఫీ) ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం మిర్యాలగూడలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో సంఘం జెండా ఆవిష్కరించి.. కేకు కోసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఇంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, వజ్రారెడ్డి, హనుమంతునాయక్, వేదమూర్తి, శేఖర్ పాల్గొన్నారు.

## బహుమతుల అందజేత

మిర్యాలగూడ లీగల్, న్యూస్‌టుడే: ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా సబ్‌జైలులో బుధవారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా అదనపు న్యాయమూర్తి జి. వేణు పాల్గొని ఆయా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, హెడ్‌వార్డన్ సుబ్బరాజు, నర్సింహులు, వెంకటరత్నం సిబ్బంది పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా అదనపు న్యాయమూర్తి జి. వేణు, జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి

## వైకుంఠధామం..

# వినియోగం కనం

దాదాపు అన్ని గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాలు ప్రస్తుతం వినియోగంలో ఉన్నాయి. కాని గుర్రంపోడు మండలం కొయిగూరోనిబాయి గ్రామపంచాయతీ పరిధిలోని వెంకటాపురం(కె)లో నిర్మించిన వైకుంఠధామం మాత్రం ప్రజలకు వినియోగపడటంలేదు. కాంక్రీటు పనులు పూర్తిచేశారు. స్వల్ప పనులు మిగిలాయి. త్వరితగతిన పూర్తిచేస్తే ఉపయోగంలోకి వచ్చే అవకాశం ఉంది.
**- న్యూస్‌టుడే, గుర్రంపోడు**



## ఎండిన కొమ్మే హెచ్చరిక బోర్డు



నాగార్జునసాగర్ హిల్‌కాలనీ మెయిన్‌బజార్ వద్ద ఎండిన కొమ్మ హెచ్చరిక బోర్డుగా పనిచేస్తుంది. నందికొండ మున్సిపల్ పరిధిలోని హిల్‌కాలనీలో భూగర్భ మురుగు నీటి పైపులైన్లకు ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్‌పై మూతలు పగిలిపోవడంతో ప్రమాదకరంగా మారాయి. ఇందులో హిల్‌కాలనీ మెయిన్‌బజార్, ప్రధాన రోడ్డు కలిసే ప్రదేశంలో నిర్మించిన మ్యాన్‌హోల్‌పై మూతలేక పోవడంతో స్థానికులు ప్రమాదాల నివారణ కోసం ఎండిన కొమ్మను పెట్టారు. ఈ విషయంపై కమిషనర్ శ్రీను మాట్లాడుతూ మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.
**- న్యూస్‌టుడే, నాగార్జునసాగర్**

# దేవీ నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక వాసవీమాత ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సముద్రాల ధనయ్య తెలిపారు. ఉత్సవాల సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఈ నెల 3 నుంచి 12 వరకు నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు ఊరె జనార్దన్, కార్యదర్శి మిర్యాల శ్రీనివాస్, కోశాధికారి ముచ్చర్ల కరుణాకర్, పట్టణ కార్యదర్శి నరేందర్, కోశాధికారి శ్రీనివాస్, సంఘం జిల్లా ప్రతినిధులు లక్ష్మయ్య, నర్సింహ, లక్ష్మీ ణారాయణ పాల్గొన్నారు.

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం నుంచి ప్రారంభం కానున్న దేవీ నవరాత్రి ఉత్సవాలకు మిర్యాలగూడలోని ఆలయాలు, మండపాలు ముస్తాబయ్యాయి. పట్టణంలోని గాంధీనగర్, శాంతినగర్ కనకదుర్గ ఆలయాలతో పాటు పలు వార్డులు, ఇతర ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. షామియానాలు, టెంట్లతో పాటు రంగురంగుల విద్యుద్దీపాలతో ఆలయాలను అలంకరించారు.

హాలియా, న్యూస్‌టుడే: మండలం కేంద్రం హాలియాలో గురువారం నుంచి ప్రారంభం కానున్న శ్రీదుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 3 నుంచి తొమ్మిది రోజులు వరుసగా బాలాత్రిపురసుందరీదేవి, శ్రీగాయత్రిదేవీ, శ్రీఅన్నపూర్ణదేవీ, శ్రీలలితా త్రిపురసుందరిదేవీ, శ్రీమహాలక్ష్మి, శ్రీమహాసరస్వతిదేవీ, శ్రీమహాదుర్గాదేవీ, శ్రీమహిషాసురదేవీ, శ్రీరాజరాజేశ్వరీదేవీ అవతార అలంకరణలో పూజలు నిర్వహిస్తారని పూజారి శ్రీరామాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా హాలియాలో ఎస్‌వీఎస్ యూత్, ఆధ్వర్యంలో నిర్వహించనున్న నవరాత్రి ఉత్సవాల కరపత్రాన్ని పుర ఛైర్‌పర్సన్ యడవల్లి అనుపమ, నరేందర్‌రెడ్డి దంపతులు ఆవిష్కరించారు.



కొండమల్లేపల్లి వాసవీమాత ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్వాగత తోరణం



ఉత్సవాల కరపత్రం ఆవిష్కరిస్తున్న పుర ఛైర్‌పర్సన్ యడవల్లి అనుపమ, నరేందర్‌రెడ్డి దంపతులు